క్లుప్తంగా

దేవాలయ భూముల్లో మట్టి తరలిస్తే కఠిన చర్యలు

ఈఓ సుధాకర్

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం బాలాత్రిపురసుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి దేవాలయ భూముల్లో నుంచి అనుమతు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈఓ సుధాకర్ హెచ్చరించారు. ఆలయం కింద ఉన్న 97 ఎకరాల మాగాణి, మెట్ట భూములతో పాటు ఆలయ సమీపంలోని దిబ్బల నుంచి మట్టి తరలింపునకు అనుమతులు లేవన్నారు. స్వామివారి భూములను కౌలుకు సాగు చేస్తున్న రైతులు మట్టి తరలించడానికి అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెడన: అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఒక వ్యక్తి మరణించడంతో పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రెండో వార్డుకు చెందిన వూట్ల కోట వెంకటనాగరాజు(55) ఇటీవల హెర్నియా ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి కడుపునొప్పి తాళ్లలేక ఈ నెల 27న గడ్డిమందు సేవించి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇంట్లోని వారు గమనించి మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి 28వ తేదీన మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించడంతో అతని భార్య నాగలక్ష్మి ఫిర్యాదుపై హెచ్‌సీ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కోలాట భజన



మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతి సందర్భంగా నగరంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలను మూడో రోజైన గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని బచ్చుపేట శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయంలో స్వామివారికి మల్లెలతో అర్చన చేశారు. హనుమత్‌తత్వం అనే అంశంపై పండితులు ప్రవచించారు. రాత్రికి వాసుదేవ కోలాట బృందం సభ్యులు చేసిన కోలాట భజన కార్యక్రమం భక్తులను అమితంగా ఆకట్టుకుంది. కోలాట గురువు నాగమణి పర్యవేక్షించారు.

మజ్జిగ పంపిణీ



మోపిదేవి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అసిస్టెంట్ ఎస్ఎస్ చక్రధరరావు అన్నారు. మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. మేకా సాయి తరుణ్ జ్ఞాపకార్థం మేకా సాయి తరుణ్ మెమోరియల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో 5వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, కందుల సీతారామయ్య, బీడీఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన



అవనిగడ్డ: మండలంలో జరుగుతున్న దివ్యాంగ విద్యార్థుల సర్వే కార్యక్రమాన్ని కృష్ణా జిల్లా సమగ్రశిక్ష విద్యా సమన్వయకర్త ఏడుకొండలు గురువారం పరిశీలించారు. స్థానిక రెండో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన దివ్యాంగ విద్యార్థుల వివరాలు నమోదు చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి 18 సంవత్సరాల వయస్సున్న దివ్యాంగులను గుర్తించి చదువుకు దూరంగా ఉండే వారిని సమీపంలోని పాఠశాలకు చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇలాంటి వారికి ఫిజియోథెరపీ క్యాంపులు, హోంటెస్ట్ విద్య, డిజిటల్ విద్యను నేర్పించనున్నట్టు ఏడుకొండలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 2 అన్నపరెడ్డి పిచ్చయ్య, పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 16 ద్విచక్ర వాహనాల స్వాధీనం

బంటుమిల్లి: అర్తమూరులో బంటుమిల్లి పోలీసులు గురువారం నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఎటువంటి ధ్రువపత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి. వాసు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్‌నయీమ్‌అస్మీ ఆదేశాల మేరకు పెడన సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది కలసి దాడుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని సంఘ వ్యతిరేక శక్తులను దృష్టిలో ఉంచుకుని తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ వాసు పేర్కొన్నారు.

అనర్హుల నుంచి రికవరీ చేయండి

- నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేయాలి
- అవకతవకల వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి
- నష్టపరిహారం మంజూరైన రైతుల పేర్లను ఆర్‌బీకేల్లో ప్రదర్శించండి
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వాణి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: మిచాంగ్ తుఫాను పంట నష్టపరిహారం విషయంలో జరిగిన అవకతవకల్లో అనర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు వెళ్లి ఉంటే వాటిని విచారణ చేసి వారిని గుర్తించి రికవరి చేసి నిజమైన రైతులకు ఆ పరిహారం అందజేయాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం హాలులో గురువారం ఎంపీపీ వాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నష్టపోయిన రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతమైన భావాలతో రైతులకు నేరుగా నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకున్నారని స్పష్టం చేశారు. కొందరు స్వార్థపరుల వల్ల పరిహారం పంపిణీ అభాసుపాలు చేస్తున్నారని, ఇటువంటి వారిని ఉపేక్షించవద్దని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు మాట్లాడుతూ మండలం అంతా బాగానే ఉందని ఒక్క సింగరాయపాలెం గ్రామంలో చోటు చేసుకున్న అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరారు. అనర్హుల ఖాతాలకు నగదు జమ అయి ఉంటే వారిని గుర్తించి ఆ నగదును నిజమైన రైతులకు అందించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కాని వారు తిరిగి నగదు ఇవ్వకపోతే క్రిమినల్ చర్యలకు అవకాశాలను పరిశీలించి ఆరుగాలం కష్టపడ్డ రైతుకు న్యాయం జరిగేలా చూడాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. కొంకేపూడి సర్పంచి దావు బైరవలింగం మాట్లాడుతూ రైతులు కాని వారి పేర్లను ఏ విధంగా జాబితా రూపొందించి పంపించారంటూ నిలదీశారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం విచారణ జరుగుతుందని ఏవో జీవీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కనీసం రైతులకు నష్టపరిహారం ఏఏ రైతులకు వచ్చాయనే వివరాలను తెలియజేయాలని కోరడంతో ఆ జాబితాలను ప్రతి ఆర్‌బీకేలలో ప్రదర్శనకు ఉంచాల్సిందిగా ఎంపీపీ ఆదేశించారు. పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 50 శాతం రాయితీతో ఇస్తున్నామని సభ్యులకు వివరించారు. విద్య, వైద్యం, విద్యుత్, గ్రామీణ నీటిపారుదల, ఇరిగేషన్, వెలుగు, స్త్రీ శిశు సంక్షేమం, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ తదితర శాఖలపై చర్చ జరిగింది. ఇరిగేషన్ అధికారులు ఎవరూ రాకపోవడం, కాల్వల ద్వారా సాగునీరు రానున్న నేపథ్యంలో గుర్రపుడెక్క, తూడు వంటి వాటిని తొలగించకపోవడంపై సభ్యులు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ జూన్ 6తో ముగుస్తోందని, ఆ తర్వాత పది రోజుల్లో మళ్లీ అత్యవసర సమావేశం వేసుకుని ముఖ్యమైన శాఖలపై చర్చించుదామని ఎంపీపీ వివరించారు. ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీవో ఫోన్ చేసినా స్పందించడం లేదని, కనీసం సమాధానం కూడా ఇవ్వడం లేదని, పరిస్థితి చక్కదిద్దాలని సభ్యులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో రెడ్డయ్య స్పందిస్తూ తప్పకుండా స్పందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ ఆర్జా వెంకట నగేష్, వైస్ ఎంపీపీలు యాదంరెడ్డి వరప్రసాద రావు, పరసా వాకాలమ్మ, ఎంపీడీవో రెడ్డయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అపోహలొద్దు

పెడన: బీసీజీ టీకాపై ఎటువంటి సందేహాలు, అపోహలొద్దని, మీలో ఇమ్యూనిటీ పవర్ పెరగడానికి మాత్రమే టీకా వేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య అన్నారు. ఆయన పట్టణంలోని బ్రహ్మపురంలోని తొమ్మిదో సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. బీసీజీ టీకా ప్రక్రియను పరిశీలించి టీకా వేసుకోవడానికి వచ్చిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారికి, షుగర్‌వ్యాధి ఉన్న వారికి, టీబీ మందులు వాడుతున్న వారు, టీబీ ఉన్న కుటుంబసభ్యులందరు కూడా ఈ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. గుండెనొప్పి, కిడ్నీ ఇబ్బందులు ఉన్న వారికి టీకా వేయరన్నారు. ఇప్పటి వరకు పెడనలో 125 మంది వరకు టీకా వేయించుకున్నారని, మరింత మంది వేసుకోవాలని సూచించారు. ప్రతి గురువారం ప్రతి వార్డు సచివాలయంలోఅందుబాటులో ఉంటుందన్నారు.



టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య

అచ్చెంపాలెం(ఘంటసాల): బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని తెలుగురావుపాలెం సచివాలయం పరిధిలోని అచ్చెంపాలెం గ్రామంలో గురువారం నిర్వహించారు. అచ్చెంపాలెం పరిధిలో 37 మందికి టీకాలు వేసినట్లు ఏఎన్ఎం జె.వీర వనిత తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు మీనా, చంటి పాల్గొన్నారు.


తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు



డ్రెయిన్ తవ్వకం పనులకు పూజలు చేస్తున్న రైతులు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి–మల్లపరాజుగూడెం గ్రామాల మధ్య ఉన్న కొత్తపల్లి మైనర్ డ్రెయిన్ మరమ్మతులకు రైతులు స్వచ్ఛందంగా సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా డ్రెయిన్ మరమ్మతులకు గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టా నాగబాబు పూజలు చేసి పనులు ప్రారంభించారు. కొత్తపల్లి డ్రెయిన్ పరిధిలో ఉన్న రెండు గ్రామాల రైతులు ఎకరాల లెక్కన చందాలు వేసుకుని నిధులు సమకూర్చుకుని డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క, జమ్ము తొలగించి పంట పొలాలు ముంపు బారిన పడకుండా ఏర్పాట్లను స్వచ్ఛందంగా చేపట్టారు. పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి గ్రామోత్సవం



కె. కొత్తపాలెంలోని అంకమ్మ అమ్మవారు

కె.కొత్తపాలెం(మోపిదేవి): కె.కొత్తపాలెంలో కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న శ్రీ అంకమ్మ తల్లి గ్రామోత్సవం గురువారం వైభవంగా ప్రారంభించారు. జంపాన వారి దేవతగా పేరుగాంచిన అమ్మవారిని ఉదయం మేళతాళాలు, డప్పుకళాకారుల సందడిలో ఆలయం నుంచి బయటకు తీసి సమీపంలోని పాలిమేర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం నది ఒడ్డున పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, టెంకాయలు మొక్కుబడిగా చెల్లించుకున్నారు. అక్కడ నుంచి ఊరేగింపుగా గ్రామదేవతలు పోతురాజు, ఓలేరమ్మ, ఘంటాలమ్మ, మావెళ్లమ్మ, రామాలయం, ఆంజనేయస్వామివారి ఎదుట సంబరాలు నిర్వహించారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవం.. బంధుమిత్రులతో గ్రామంలో పెద్ద పండగ వాతావరణం నెలకొంది. రెండోరోజు శుక్రవారం తెల్లవారు జామున అమ్మవారు ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఆలయం వద్ద పెద్ద ఎత్తున సంబరాలు చేసి నైవేద్యాలు సమర్పించుకున్న అనంతరం అమ్మవారు ఆలయ ప్రవేశం ఉంటుందని కమిటీ అధ్యక్షులు జంపాన మాణిక్యాలరావు, పడమట సుబ్బారావు, పడమట వెంకటేశ్వరావు, రెడ్రౌతు రవిబాబు వివరించారు.

ప్రజలు ఉక్కిరిబిక్కిరి

ఎండ తీవ్రతకు రోడ్లు నిర్మానుష్యం



నిర్మానుష్యంగా కోడూరు–నాగాయలంక ప్రధాన రహదారి

కోడూరు: భానుడి భగభగలతో జనం అల్లాడుతున్నారు. రోహిణికార్తె ప్రభావంతో సూర్యోదయతోనే సూర్యుడు నిప్పులు చెరుగుతుండటంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. సముద్రతీరానికి అతి సమీపంలో ఉండే దివిసీమ ప్రాంతంలో ఎండల తీవ్రత గణనీయంగా పెరిగింది. గురువారం ఉష్ణోగ్రతలు 43డిగ్రీలకు పైగా నమోదు కావడంతో పాటు వడగాల్పుల తీవ్ర అధికంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9గంటలకే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో ప్రధాన కూడళ్లు, వ్యాపార సంస్థలు ప్రజలు లేక వెలవెలబోతున్నాయి. చిరువ్యాపారులు తమ దుకాణాలను మూసి వేసి ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న సమయంలో అత్యవసరంగా ప్రయాణాలు చేసే వారు తలకు, ముఖానికి చేతి రుమాలలు, కాటన్ మాస్కులు ధరించి వెళ్తున్నారు. పలువురు వృద్ధులు చెట్లు కింద సేదతీరుతూ కనిపించారు. సాయంత్రం 6 గంటల వరకు తీవ్రత కొనసాగింది.

ముగిసిన సుందరకాండ హోమం

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న సుందరకాండ హోమానికి పండితులు డీవీ మేఘనరసింహకుమార్, ఆర్. హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య పూర్ణాహుతిని వైభవంగా నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా హోమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుందరకాండ విశిష్టతను సోదాహరణంగా వివరించిన కుమార్ భక్తుల మనసులను రంజింపజేశారు. 44 రోజులుగా కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి సువర్చలాంజనేయస్వామి మురళి కోలాట బృందం చేసిన ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, హిందూ శోభాయాత్ర సంఘం సభ్యులు, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



సువర్చలాంజనేయస్వామి ఆలయంలో సుందరకాండ హోమానికి పూర్ణాహుతి

4 నుంచి రామేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



టేకుపల్లిలో రామేశ్వరస్వామి



శ్రీ బాలపార్వతి అమ్మవారు

టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లి గ్రామంలో శతాబ్దాల చరిత్రగల శ్రీ బాలపార్వతి సమేత రామేశ్వరస్వామి ఆలయంలో జూన్ 4, 5, 6 తేదీల్లో వైభవోపేతంగా కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ దేవాలయం 2014 నుంచి కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని ఆలయ కార్యదర్శి యడవల్లి నీలలోహిత శాస్త్రి తెలిపారు. 4వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు శ్రీవారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ పుణ్యాహవచనం, అంకురార్పణ, వాస్తుపూజ, ధ్వజారోహణ, వాస్తుపూజ, ధ్వజారోహణ, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు ఉంటాయని తెలిపారు. 5వ తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతః కాలస్నపన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పంతో పూజలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 8 గంటలకు శ్రీ స్వామివారి దివ్య కల్యాణోత్సవం కనులపండువగా వైభవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. 6వ తేదీ గురువారం ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, ప్రాతః కాలార్చన, నీరాజన మంత్రపుష్పంతో ప్రత్యేక పూజలు అనంతరం అన్నదానం జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 6 గంటలకు గ్రామంలో స్వామివార్ల రథోత్సవం ఉంటుందని తెలిపారు. 7వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు వసంతోత్సవం, అవభృథ్ స్నానోత్సవం పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ, ధ్వజరోహణ, పండిత సత్కారం ఉంటాయని వివరించారు.

నాణ్యమైన, రుచికరమైన వంటలు చేయాలి



ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో వంటను పరిశీలిస్తున్న ఏడీ మనోహర్ నాయక్

ఘంటసాల: ప్రతి విద్యార్థి పాఠశాలలో భోజనం చేసేలా పరిశుభ్రమైన నాణ్యమైన రుచికరమైన వంటలు చేయాలని మధ్యాహ్న భోజన పథకం కృష్ణా జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వి.మనోహర్ నాయక్ అన్నారు. ఘంటసాల మండలంలోని జెడ్పీ హైస్కూల్స్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన 42 మంది కుకింగ్ ఏజెన్సీ వారికి గురువారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మనోహర్ నాయక్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెనూను రూపొందించిందన్నారు. దానికి అనుగుణంగా కుకింగ్ ఏజెంట్లు వంటలు చేయాలన్నారు. వారానికి ఐదు గుడ్లు, మూడు చిక్కీలు, ఇతర రుచికరమైన ఆరోగ్యకరమైన వంటలను అందించాలన్నారు. మెనూ ప్రకారం వంటలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని, మీకు ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం తిరుపతి తాజ్ హోటల్ చెఫ్‌లు చేసే వంటల వీడియోలు చూపించి ఆయా కుకింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చి వంటలు చేయించారు. 42 మంది కుకింగ్ ఏజెంట్లు చేసిన వంటకాలను న్యాయనిర్ణేతలు రుచిచూశారు. శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ మొదటిస్థానం, ఘంటసాల జెడ్పీ హైస్కూల్ రెండో స్థానం, ఎంపీపీఎస్ ఘంటసాలపాలెం మూడవస్థానం సాధించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నారేపాలెం శివశంకరరావు, మహమ్మద్ మోమిన్, ఆయా హైస్కూల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ఇనగుదురుపేట సీఐ సీహెచ్ విద్యాసాగర్

కోనేరుసెంటర్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఇనగుదురుపేట సీఐ సీహెచ్ విద్యాసాగర్ మందుబాబులను హెచ్చరించారు. ఆయన స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటం అత్యంత ప్రమాదకరమన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి అనేక మంది ప్రమాదాలకు కారకులైనట్లు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ నెల 29న ముగ్గురు వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా కేసులు నమోదు చేసి కోర్టుకు పంపామన్నారు. న్యాయస్థానం మందుబాబులకు వారం రోజుల పాటు జైలుశిక్ష విధించడం, ఇద్దరికి రూ. 2500 చొప్పున జరిమానా విధించిందని తెలిపారు. మూడో వ్యక్తికి ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ. 4000 జరిమానాగా విధించినట్లు చెప్పారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

బంటుమిల్లి: కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీఐటీయూ నేతలు చెప్పారు. సీపీఐ(ఎం) అనుబంధ కార్మిక సంస్థ సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనం వద్ద బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకుడు జి. శ్రీనివాసరావు సంఘ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో పలు కార్మిక సంస్థల సభ్యులు జి. శేషుబాబు, కె.రవి, రాజశేఖర్, ప్రభు, శ్రీను, మూర్తి, రైతు సంఘ కార్యదర్శి ఎల్. అజయ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వేసవి శిబిరం




చల్లపల్లిలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న బాలలు

చల్లపల్లి: వేసవి సెలవులు పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందడిగా సాగుతోంది. గురువారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, ఆటల పోటీలు, పుస్తక పఠనం నిర్వహించారు. లైబ్రేరియన్ కె.గణేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథలు చెప్పారు.

ఘంటసాల: గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞానానికి తోడ్పడతాయని గ్రంథాలయాధికారులు ఎం.శరత్ కుమార్, ఎం.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండలంలోని ఘంటసాల, కొడాలి గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.శరత్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, క్విజ్ పోటీలు నిర్వహించారు. కొడాలి గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో పుస్తక పఠనం చేసిన అనంతరం మ్యూజికల్ చైర్స్ పోటీలు జరిగాయి.

ఈ సెట్‌లో కప్పలదొడ్డి విద్యార్థికి రెండో ర్యాంకు



భవానీశివసాయి వెంకట్

గూడూరు: ఈసెట్ ఫలితాల్లో కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డి విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాడు. గ్రామానికి చెందిన పేరిశెట్టి భవానీ శివ సాయి వెంకట్ మెటలర్జీ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. ఈ సెట్‌లో 112 మార్కులతో ఇంటిగ్రేటెడ్ ర్యాంకు 539 సాధించగా మెటలర్జీ విభాగంలో 2వ ర్యాంకు వచ్చింది. 2017–18వ బ్యాచ్‌లో కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన సాయి వెంకట్ 9.8 జీపీఏ సాధించి పాఠశాలస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అనంతరం విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెటలర్జీ బ్రాంచ్‌లో డిప్లమో పూర్తి చేశాడు. ఈ ఏడాది నిర్వహించిన ఈసెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించాడు. తండ్రి చిన్నప్పుడే మరణించినా మేనమామ రామకోటేశ్వరరావు ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.